# 30. పుర్రెకో బుద్ధి

**నిజంగా** జరిగిందోలేదో తెలీదుగాని, మా ఫ్రెండు దేవరాజు రాధాకృష్ణమూర్తి తండ్రిగారు నాతో, ఒక జోకులాంటి ఉదంతం చెప్పేరు.

బ్రిటిషువాళ్ళు మన దేశానికి పాలకులుగా ఉన్న రోజుల్లో ఓసారి, ఓ చోట సాక్షాత్తూ యురపియనే ఒక ఆఫీసుకి "హెడ్"గానూ; ఒకానొక భార్యావిధేయుడైన ఆంధ్రుడు హెడ్ గుమాస్తాగానూ- ఉండడం సంభవించింది.

ఆ ఏడాది శ్రావణమాసంలో పౌర్ణమికి ముందర వచ్చే శుక్రవారం (వరలక్ష్మీ వ్రతం) నాడు ఈయన ఇంట్లో తనకి అందుబాటులో ఉండాలని హెడ్ గుమస్తాగారి భార్యగారు గట్టిగా కోరారు. ఆఫీసరు గారు ఊళ్లో ఉన్నరోజున తాను సెలవు పెడితే అది గ్రాంటవకపోవడం అటుంచి, ఎవరైనా వచ్చి ఆయనతో పెట్టుకునే మొరలనుగాని, ఆయనకి సమర్పించుకున్న అర్జీలను గాని ఇంగ్లీషులోకి తర్జుమా చేయగల వారు ఈయనతప్ప మరొకరు ఆ ఆఫీసులో లేరు. పోనీ భార్యగారి మాట తోసిపుచ్చాలంటే అది మరింత ఇబ్బంది తెచ్చిపెట్టడం ఖాయం. ఈ పరిస్థితుల్లో సదరు హెడ్ గుమాస్తాగారు ఒక నోట్ తయారు చేసి అధికారికి పుటప్పు చేశారు. "శ్రావణమాసంలో పున్నం ముందరి సుక్కురారం ఈ ప్రాంతపు జనులకు చాలా ముఖ్యమైన పండుగ. కులం ఏదైనాసరే ఈ పండుగ అందరూ విధిగా జరుపుకొని తమ పుత్రికా సంతానాన్నీ కొత్తకోడళ్లనీ గౌరవించు కుంటారు. కనుక, ఆ దినం శెలవు ప్రకటిస్తే అందరు ఉద్యోగులకూ తమయందున్నూ మమ్మేలుతున్న బ్రిటిష్ ప్రభుత్వము యందున్నూ గౌరవం కలిగి వారందరు విశ్వాస పాత్రులుగా విధేయులుగా ఉండగలరు."

ఈ నోట్ చూసి, ఆ యురోపియన్ ఆఫీసర్‌గారు: "దీనికి ఏదైనా, ప్రీసీడెంటు (అంటే ఇంతకుముందు ఇలా ఈ పండగకి సెలవు ఇచ్చే సంప్రదాయం) ఉన్నదా?" అని క్వొరీ వేసి పంపేరు.

వెంటనే సదరు హెడ్ గుమాస్తాగారు దానికి జవాబు రాసేరుట: "క్రిందటేడాది ఈ పండుగ శ్రావణ పౌర్ణమి నాడే వచ్చింది. అది మన సెలవుదినాల జాబితాలో ఉన్నదే. అటుక్రిందటేడాది ఈ పండుగ ఆదివారం పడిపోయింది. అది ఎలాగూ సెలవే. అంతకు ముందు నేనూ ఈ ఆఫీసులో లేను, తమరు కూడా ఇక్కడ లేరు. "గనుక మనవి చేయడమైనది!"

ఆఫీసర్ గారు ఈ సమాధానంతో సంతృప్తిపడి (శ్రావణ శుక్రవారం గానీ గుడ్ ఫ్రైడే గాని ఆదివారం పడే అవకాశం ఉండదని గ్రహించనివారై) శలవు ప్రకటించమని అనుమతించేరట.

సహదేవరావు ఎం.డి.గానూ నేనొక చిరుద్యోగిగానూ ఉన్న ఒక సంస్థలో ఒకసారి ఒక చిన్న సమస్య వచ్చి పడింది. ఒకానొక ఉద్యోగి గుండె జబ్బుతో బాధపడుతూ తమ (మా) సంస్థ ఆస్పత్రిలో తన వ్యాధి నయం చేసే వైద్యశాస్త్ర నిపుణులూ యంత్రాంగం లేనందువల్ల మద్రాసులో ఉన్న ఫలానా ఆస్పత్రిలో చికిత్స చేయించుకోగోరుతున్నాననీ, అయితే ఆ మద్రాసు ఆస్పత్రివారు ఈ చికిత్సకు గాను కోరే రుసుము తాముగా భరించలేనంత అధికంగా ఉన్నందువల్ల సంస్థలో ఉద్యోగుల సంక్షేమం నిమిత్తం కేటాయించిన నిధులనుండి ఇరవైవేల రూపాయల గ్రాంటు

ఇప్పించమనీ ఒక విన్నపం వ్రాసుకున్నాడు. కిందపెట్టీ మీద పెట్టీ ఆఫీసువాళ్లు నోట్‌లు పుటప్పు చేసేరు. "సంక్షేమ నిధిలో ఈ రకం ఉపకారాలకి డబ్బు ఉంది. ఈ ఉద్యోగి తాహతును బట్టి ఇరవై వేల రూపాయలు ఇవ్వడానికి ఎం.డి. గారికి అధికారం ఉంది." అని తేలింది. ఆర్డరు పడింది. డబ్బు వచ్చింది. ఉద్యోగి మద్రాసు వెళ్లేడు; చికిత్స పొందేడు; ఆరోగ్యం కుదుటబరచుకున్నాడు.

అయితే ఆస్పత్రివారు ఆ చికిత్సకు గాను వేసిన బిల్లు ఇరవై అయిదువేల మూడు వందల తొంభై రూపాయలు, ఇరవై వేలు చెల్లించి, తన ఉద్యోగం, సంస్థ వివరాలు తెలుపుతూ కొరదలా డబ్బు సంస్థనే అడుక్కోవాలి తప్పా తన దగ్గిర లేదనీ, తనమీద నమ్మకమూ దయా ఉంచి తనని డిశ్చార్జి చేస్తే కొరదలా డబ్బు ఎలాగో చెల్లించుకుంటాననీ హామీ పత్రం రాసి వాళ్లని ఒప్పించి తిరిగి విశాఖపట్నానికి వచ్చేడు. ఒచ్చిన మర్నాడే ఆ ఉద్యోగి ఎం.డి. (సహదేవరావు) గారి దర్శనం చేసి; తన ఆరోగ్యం బాగుపడిందన్న సంగతి మనవి చేసుకొని; ఈ బిల్లు పితలాటకం సంగతి కూడా ప్రస్తావించేడు. "ఇంకా 5,390 రూపాయలు కట్టమంటున్నారు. నా దగ్గిర ఏమీ లేదు. ఆస్పత్రివారు నన్ను అక్కడ నెలరోజులు ఉంచారు. ఈ నెలరోజులూ మాఆవిడా మా అమ్మాయీ నాతోబాటుగా మద్రాసులో ఉన్నందుకు, మేం ముగ్గురం మద్రాసు వెళ్లి వచ్చినందుకు; ఆహార వసతి ఆది సౌకర్యాలలో నామీద మరింత శ్రద్ధ తీసుకున్నందుకూ మాకు సుమారు 7,500 రూపాయలు ఖర్చయ్యాయి. ఇందులో 4,000 మా ఆవిడ మంగళ సూత్రాలు అమ్ముకుంటే వచ్చింది. 3,500 అప్పుచేశాం. ఇప్పుడు ఆస్పత్రివారికి 5,390 కూడా కట్టాలంటే సుమారొక ఏడాదిపాటు మేం అక్షరాలా పస్తులు పడుకోవాలి తప్పా మరో దారి లేదు. కనుక, కనీసం ఆస్పత్రివారు చెల్లించమంటున్న ఈ 5,390 మన సంస్థయొక్క సంక్షేమ నిధులనుండి ఇప్పించి వారి దృష్టిలో నేనొక మోసగాణ్ణిని అనిపించుకోకుండా కాపాడగలరని ప్రార్థిస్తున్నాను" అన్నాడు.

"ఇదంతా కాగితం మీదపెట్టు" అన్నాడు సహదేవరావు.

ఆ అప్లికేషను మీద ఛీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్‌గారూ సంక్షేమాధికారిగారూ పకడ్‌బందీ అయిన నోట్ రాశారు. "ఇతను దిగువతరగతి ఉద్యోగి. ఇరవై వేలు ఇవ్వడంలోనే కొంత కనికరం చూపడమైంది. వాస్తవానికి ఇతని "బేసిక్ పే" మొదలైనవన్నీ పరిగణనలోకి తీసుకుంటే అతనికి 19,600 రూపాయలకు మించి ఏ గ్రాంటూ ఇవ్వరాదు. కనుక మనవి చేయడమైనది."

ఈ నోట్ శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకి టైపు అయింది. ఫైనాన్సు యూనిట్ నుండి ఎం.డి యూనిట్‌కి పంపితే "టైమైపోయింది, సోమవారం పంపండి" అని తిప్పేశారు. అయితే చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్ గారి స్టెనో ఈ సంగతి చూచాయగా సదరు ఉద్యోగి చెవిని వేశాడు. "గురూ, నీకే అదనపు గ్రాంటు రాదు సుమీ!" అంటూ.

గుండె జబ్బు (బాగుపడిన ఆ) ఉద్యోగి ఆదివారం ఉదయమే ఎం.డి.గారి బంగళాకి వెళ్లి "సి.ఏ.ఓ" గారు ఇలా ఇలా రాసేశారుటండీ; మరి నాకింక దిక్కేది- అంటూ సహదేవరావుతో చెప్పుకున్నాడు.

"ఫైనాన్స్ వాడు కదయ్యా మరి! ఇవ్వొద్దు అని రాయకపోతే ఇచ్చేయండి అని రాస్తాడా? అధైర్యపడకు. వెళ్లు. నేను చూస్తాన్లే." అన్నారు సహదేవరావు.

సోమవారం ఉదయం పదకొండుగంటలకి సహదేవరావు ఆ నోట్ తన దగ్గిరే ఉంచుకుని సి.ఎ.ఓ.గారికి కబురు పెట్టేరు. ఆయన రాగానే ఫైలు ఆయన వైపు తోసి "ఈ విషయంలో ఏం

చేద్దామంటారు?'' అని అడిగారు.

"సి.ఏ.ఓ'' గారు "ఎం.డి.''గారి ఉపకార ధోరణిని గ్రహించేరు. "రూల్ ప్రకారం అయితే ఇవ్వకూడదు. పైగా ఇలా ఏవేవో కష్టాలు చెప్పుకోగానే తమరు మెత్తబడిపోయి అదనపు గ్రాంట్లు ఇచ్చుకుంటూ పోతే ఇదొక ప్రీసీడెంటుగా తయారైపోయి ఎవరుపడితే వాడు చెయ్యిజాపీడం మొదలెడతాడు.'' అని (నై)పుణ్యం ఉట్టిపడేటట్టుగా చెప్పేరు.

సహదేవరావు సి.ఏ.ఓ గారికి షేక్హాండు ఇచ్చేరు. "సరిగ్గా చెప్పేరు మీరు.'' అని; ఐదు సెకెండ్లు ఆలోచించి ఇలా అన్నారు. "నా దృష్టి మాత్రం ఎందుకో వేరే విధంగా ఉంటుందండీ. ప్రీసీడెంటు ఏర్పడ్డాక దాన్ని దుర్వినియోగం చేసేవాళ్లు ఉంటారని కాక; ప్రీసీడెంటు అంటూ ఏర్పరిస్తే దాన్ని ఆధారం చేసుకొని మీరు గాని నేను గాని మన తర్వాత ఈ సంస్థకి వచ్చేవారుగాని ఇట్లా ఆపదల్లో చిక్కుకున్న మరికొందరికి ఉపకారం చెయ్యగలుగుతారేమో అని నాకు అనిపిస్తుంది. ఫైలు పట్టుకుపోయి మళ్లీ పంపండి.''

ఆ ఉద్యోగికి మరో నాలుగు వేల రూపాయల గ్రాంటు వచ్చింది. అంతా కాకపోయినా కొంతయినా వచ్చింది కదా అని అతనూ, అంతా కాకపోయినా కొంతయినా కట్ చేసేరు కదా అని కొందరూ, సంతోషమే పొందారు...

☀

*("ఆంధ్రభూమి" డెయిలీ: 4-3-92)*